# పాత కథే

ఒంటిగంటయినట్లుంది–అని చాపమీద పక్కకు పొర్లింది పార్వతి. చేతిగాజొక్కటి పుటుక్కు మన్నది. ఆ గాజు ముక్కల్ని ఏరి పక్కకు పెట్టింది. ఒంటిగంటయినట్లుంది– అని పార్వతి అనుకుంది కదూ, అంత మాత్రంచేత సరిగ్గా ఆ వేళకు ఏదో పెద్దపనుందని అనుకోనక్కర్లేదు. ఒంటిగంటంటే, ఆఫీసులో వాళ్ళాయనకు టిఫినువేళయిందని గుర్తుకు రావడమన్నమాట. ఈ గుర్తుకు రావడం అన్నది చాల గొడవయిన అంశం. గుర్తుకొచ్చే విషయాలు సముద్రపు ఒడ్డున అలల్లా వస్తాయి, చైనా సైనికుల్లా నిరంతరంగా వస్తాయి.... ఒంటిగంటంటే ఆయనకు టిఫినువేళ.... కాని తను ఇవాళ ఆయనకేమీ టిఫిన్ చేసివ్వలేదు. ఎందుచేత? ఏదయినా చెయ్యడానికి పిండిలేదు గనుక, నూనె లేదు గనుకా. పోనీ పచ్చడీ అన్నమయినా పట్టుకెళ్ళమంది తను. 'అబ్బే. వద్దులే, ఏదో కేంటీన్‌లో తింటాలే–' అన్నారాయన.... కేంటీన్ అనేసరికి ఓ రెండువేల యుగాలకు ముందొక సాయంకాలం, ఆయన మల్లెపూల పొట్లంతోబాటు తెచ్చిన జాంగిరీల పొట్లం, గుర్తుకొస్తుంది.... పొర్లి పడుకుంది పార్వతి. పడుకోలేక లేచింది. కూచుంది. మళ్ళీ పడుకుంది.

"ఒంటిగంటయిందోయ్ సూర్యం!" అన్నాడు సీ–త్రీ....

"నాకు పనుందోయ్, నువ్వెళ్ళు...." అన్నాడు సూర్యం అనబడే సీ–టూ. సీ–టూ–అంటే కూచునే స్థలం మాత్రం కాదు. కన్‌స్ట్రక్షన్ సెక్షన్–క్లర్క్–నెంబర్ టూ అని అర్థం.

అయినా గుమాస్తాలకి పేర్లెందుకు-నెంబర్లు చాలు ! ఒంటిగంట యిందని సీ త్రీ చెప్పక్కర్లేదు సూర్యానికి. అతడి కడుపే చెప్పింది. కాని ఏం చెయ్యడం? జేబులో ఉన్న మూడు పైసలతో హోటలు కెడితే కాఫీ కప్పు వాసనయినా చూడనివ్వరే....! ఈ భూప్రపంచమ్మీద తన స్థిర చరాస్తులన్నీ కలిపి రొఖ్ఖ-రూపేణా మూడు పైసలని తెలిస్తే నలుగురిలో తన చులకనయిపోడూ-మరి ఇదంతా ఒక పెద్ద నాటకమాయె, అందులో తనదొక వేషమాయె, పాత్రోచితంగా అభినయించకపోతే అభిమానం అనే ఆ రసం రసాభాసయిపోదూ? అందుచేత సీ-త్రీ చెప్పినా, ఆకలి చెప్పినా, అవతలి గదిలో కొందరు కమ్మటి టిఫిన్లు తింటున్నా-సూర్యం కుర్చీలే అతుక్కుని కూర్చున్నాడు. పై పెచ్చు తనసుందర టేబిలుమీద ఒక పెద్ద కాగితాన్ని పరుచుకుని కూర్చున్నాడు.

దాన్నిండా గళ్లూ, అంకెలూ ఉన్నాయి. వైకుంఠ ఏకాదశినాడు ఆడతారే పరమపదసోపాన పటము-దానిలా ఉంది ఆ కాగితం. అదొక సాంవత్సరిక స్టేటుమెంటన్నమాట. ఆ ఆఫీసులో ఆ స్టేటుమెంటుని ఠంచన్‌గా తయారుచేయగలవాడు సూర్యం ఒక్కడే. ఆ గర్వం- సూర్యం కూడా-పడతాడు-కాని వెంటనే అనుకుంటాడు-ఛ.... ఇదేమిటి, ఇంతకన్న పెద్ద కార్యాలు సాధించవలసిన వాడిని, కేవలం అజ్ఞాత వాసంలో ఉన్న కారణపురుషుడిని, ఎప్పుడో రాబోయే దేనికోసమో పుట్టినవాడిని, నే నెక్కడ-ఈ స్టేట్ మెంటెక్కడ, నే నెక్కడ ఈ బోడి ఆఫీ సెక్కడ - అని అనుకుంటాడుసూర్యం. అనుకుని ఆ స్టేట్ మెంట్‌లో అక్కడోపదం ఇక్కడో అంకె వేస్తాడు. ఇప్పటికి తన చేతిమీదుగా వెళుతున్నది. ఇది ఆరో స్టేటుమెంటు.

ఈ స్టేటుమెంటుల్లో ఒక చిత్రముంది. ఇవి కావాలని ఎవరు ఎందుకు అడుగుతారో సూర్యానికి అర్థమవదు. అందులో తాను వేసేదల్లా అబద్ధాల అంకెలు. ఇలాటివన్నీ ఏ ఢిల్లీలోనో — ఒక పెద్దాఫీసులో చేర తాయి-పూర్వజన్మ కర్మలన్నీ చేరినట్లు, అప్పుమీద అప్పు చేరినట్లు....కా

ఈ అంకెలమీదనే దేశం ఆధారపడి ఉంది మరి. ఏ పార్లమెంటులోనో ఒకాయన అవలిస్తూ అడుగుతాడు—"ఫలానా సంవత్సరంలో మొత్తం ఎన్ని కేసులు పట్టుకున్నారు. ఎన్నివదిలేశారు?" ఆపళంగా గౌరవనీయులైన మంత్రి ఓ పెద్ద బృహత్ స్టేట్‌మెంటు నుండి ఇట్టే టపటపమని అంకెలు చదివేస్తారు. ఆ అంకెల్ని గొప్ప రిపోర్టర్లు నవ్వుతుంటూ రాసుకుని గొప్ప గొప్ప పత్రికలకి పంపిస్తారు గొప్పగొప్ప పత్రికల సంపాదకులు నవ్వు తుంటూ పెద్దపెద్ద శీర్షికలతో అచ్చువేయిస్తారు ఎందు చూచినా ఈ అంకెలే ఈ శీర్షికలే కనిపించేసరికి పత్రికలు చదివే కుటుంబరావూ, అప్పారావు వాటిని వేదవాక్యాలని నమ్ముతారు. దరిమిలా మనదేశం ఇన్ని కిల్లోమీటర్లు ముందుకొచ్చింది, ఇన్ని మిలిమీటర్లు పైకి లేచింది. అని స్వాతంత్ర్య గణితంలోకి పోతాను కాని ఆ అంకెల తమషా అంతా వాటి వెనక ఉన్న సూర్యానికి తెలుసు. అతడు కూడా నవ్వుకుంటాడు పత్రికా సంపాదకుడిలా....

ఏదయితేనేం, ఆపూట టిఫిన్ వేళయిపోయింది దోసె మాడిం దనో, బాసుందిలో తీపు తగ్గిందనో అనుకొంటూ మిగతావాళ్ళందరూ ఆఫీసుసీట్లకు మళ్లీ అతుక్కుపోతున్న వేళకు, సూర్యం కాస్త ఆకలినీ, కాస్త స్టేటుమెంటునీ అరగించి, ఆవేళకు అయిందనిపించాడు. అలా అని పించడంలో ఓ సుగుణం ఉంది సుమండి—ఒకవేళ సూర్యంజేబులో డబ్బు ఉందనుకోండి, టిఫిన్ వేళప్పుడు టిఫినే చేశాడనుకోండి – కనీసం ఓ యాభై పైసలయినా అవునా? ఇప్పుడు చూడండి, సూర్యంబాబు ఆ యాభై పైసల్ని ఇంచక్కా ఆదాచేసుకున్నాడు మరి!

అలా అక్కడా, అక్కడా సూర్యాలు, చంద్రాలూ ఇలా పొదుపు చేయబట్టేకద, ధరల స్థిరీకరణ మొదలయిన పెద్ద సమాసాలు బతికేది! సూర్యం స్టేటుమెంటు అయింది. రెండున్నరకొట్టింది గడియారం.

గడియారం మూడు పలకడం విన్నది పార్వతి. ఇంకా చాపమీద నుండి లేవలేదు. రెండుసార్లు లేచి కూచుంది. కాని మళ్ళీ పడుకుంది. ఏం చెయ్యాలి గనుక-పిల్లలా పాపలా! పిల్లలంటే పార్వతి కడుపులో లావా మరుగుతుంది. పుట్టిఏడాది రెండునెలలు పెరిగింది ఇందిర. ఎంత అందమో, ఎంత తెలివో! ఆయనకయితే సరి దానితోనే లోకం... ఆ కూననుచూసి బాధలన్నీ మరచిపోయేవారు. కాని హఠాత్తుగా ఆ సంతోషాన్ని లాగేసుకున్నాడు దేవుడు. డాక్టరు చెప్పిన మందుఖరీదుని అప్పు తెచ్చేలోగా, రేపొద్దున్న సంక్రాంతి అనగా, ఇవాళ సాయంకాలం వెళ్ళిపోయింది.... ఛ.... ఇదేవిటి, వద్దనుకున్నా ఈ ఆలోచనలన్నీ ఎందుకు రావాలి—అని మనస్సుని విదిలించుకుంటూ లేచింది పార్వతి. గది బయటికివచ్చింది.

ఆ మామిడిచెట్టుమీద గండుచీమలు హడావిడిగా తిరిగేస్తున్నాయి. తలెత్తి చూసింది పార్వతి. నల్లటిపిట్ట ఒక్కటి ముచ్చటగా కూచుని ముక్కుతో ఎంతో ఒడుపుగా చిగుళ్ళను కాటోలు తుంచుకొని తింటూంది. ...కిసలయము, పంచమస్వరము అని చిన్నప్పుడు చదువుకున్న పదాలేవో గుర్తుకొచ్చాయి పార్వతికి.

చిన్నప్పుడంటే ఏ పదేళ్ళకిందో కాదు, పట్టుమని మూడేళ్ళయినా కాలేదు పార్వతి మెట్రిక్ పరీక్షకుకూర్చుని ఫెయిలయి. అశలూ, ఎదురు చూడడాలూ లేని రోజులవి. నిరాశలూ, ఎదురుచూసినవి రాకపోవడాలూ లేని రోజులవి. ఏరోజు కారోజు—విందుగా—ఒక మంచి చిన్నకథలా ఉండిన రోజులవి. రేపుకోసం నిట్టూర్చే ఇవ్వాళలులేవు ఆరోజులలో.... కాని అవి గడిచి తను చాలదూరం వచ్చేసినట్లుంది—అని పార్వతి ఏదేదో అనుకొంటూ ఉండగా "ఏమండోయ్" అని పిలిచింది పక్కింటిజయమ్మ. తిరిగిచూసింది పార్వతి.

జయమ్మ హైస్కూలుటీచరు – పెళ్ళికాలేదు. ఆమెదగ్గర చాలా బోలెడు అనేకమయిన చీరలున్నాయి. నెలలో ముప్ఫైరోజులూ, ఒకరోజా

కట్టిన చీర మళ్ళీ కట్టకుండా గడుపుతుంది ఆవిడ. ఒక్క చీరలతోనే ఆడదానిజీవితం నిండిపోదనుకోండి అయినా తనకున్నవి నాలుగుచీరలే అన్న తలపు ఏమంత అందం చెప్పండి....

ఆ జయమ్మ – అన్నిచీరలున్న జయమ్మ, అవన్నీ చాలనట్టు (బహుశా ముప్పైయొక్క రోజులున్న నెలలో ఆఖరిరోజు కోసమేమో?) ఎవడో మూటలవాడొస్తే, వాడిని పిలిచింది. బేరమాడుతూంది. పార్వతిని పిలిచి ఫలానాచీర బాగున్నదా అని అడిగింది.

భేషుగ్గా ఉందన్నది పార్వతి. తనేగనుక కొనుక్కునేట్లయితేనే ఎంతచక్కటిచీర ఎన్నుకునేదో. తనఅభిరుచులు ఎంతో నాజూకుగా ఉంటాయని అంటుంటారు ఆయన.

ఆచరణలోకి తర్జుమా చేయబడని అందమైన ఆలోచనలెన్నో పార్వతిబుర్రలో దాగిఉన్నాయి—మట్టిలో గింజల్లా అవి రే పెప్పుడో మొక్కలయి, తీగెలయి, పువ్వులవుతాయి. కనీసం అవ్వాలని పార్వతి ఆశ.... "మీరో చీర, అదిగో, ఆ నీలం గళ్లది తీసుకోకూడదూ..." అంది జయమ్మ. "మీ తెల్లటిఒళ్ళికి ఎంతో బాగా నప్పుతుంది" అనికూడా అంది వల్లటి జయమ్మ....

ఆ క్షణాన తన తెల్లటిఒళ్ళిని కప్పిన చాయపోయిన వూదారంగు చీర చూడ్డానికి సిగ్గేసింది పార్వతికి. అయినా అలాటి ఘట్టములనేకములు నారియుతేరిన మూర్తి గనుక–"అబ్బే–ఆయన లేకుండా నే నేదీ కొననండీ–" అంది.

జయమ్మకు 'ఆయన' అంటూ లేడుగా. అంచేత ఆ అంశంలో తనో మెట్టుపైనఉంది: అదొక చిన్న సంతృప్తి—ఎడారిలో నీటి చుక్కలా.

అయిదుకు పది నిముషా లుండనగా చేతిలో కలాన్ని అవతలపడేశాడు సూర్యం. గుమాస్తాగా అపూటకిక అస్తమించేద్దామని అతడి ఉద్దేశం.

తను అప్పుడే రాసి ముగించిన ఉత్తరం మళ్లీ ఓసారి చదువుకున్నాడు. అందులో ఆ రెండో పేరాలో ఆ వాక్యం ఎంత బ్రహ్మాండంగా కుదిరిందో అని క్షణంమురిసాడు. మరుక్షణం....ప్....జనం ఆటేరానిసభలో మంచి పాటలు పాడేయవలసివచ్చిన పాటకుడిలా ఫీలయ్యాడు.

ఎంతో కష్టపడి నేర్చుకున్న ఈ ఇంగ్లీషు, ఈ వాక్యాలసొంపు, ఆఫీసులు ఇంకా 'ఎఫిషియంట్'గా పనిచేయడంమీద తనకున్న వూహలు ఇవన్నీ ఇక్కడ వృధా అయిపోతున్నాయే అనుకున్నాడు. రేపటినుండి ఇంత చక్కగా పనిచేయకూడదు. కొంత దాచేసుకోవాలి. పని చేసినకొద్దీ తిట్లెక్కువ. పని చేసినకొద్దీ పనికూడా ఎక్కువే అవి నేర్చుకోవడానికి ఆరేళ్లు పట్టింది.

పనికన్నా, తెలివికన్నా, ఇంగ్లీషు గ్రామరుకన్నా పెద్దవాళ్లని మెప్పించడం ముఖ్యం. హెడ్ క్లర్కు వేసిన 'జోకు'ల మేకులు నవ్వుతూ మింగాలి. తనురాసిన అద్భుతమయిన ఉత్తరం ఆఫీసరుచేతిలో చిత్రవధకు లోనవుతున్నప్పుడు ఆయనగారి స్పెల్లింగులు చూడ్డం మానేసి 'ఇంత చక్కటి హేండ్ రైటింగ్ ఎలా వచ్చిందిసార్ మీకూ—?' అని అచ్చెరు వొందగలగాలి. సెక్షన్ హెడ్డుఅబ్బాయి బడికెళ్లి జీతంకట్టిరావాలి. ఆఫీసరుగారి 'ఫామిలీ' సినిమాకు వెళ్లేట్లయితే ముందస్తుగావెళ్లి టిక్కట్లూ అవీ ఏర్పాటుచెయ్యాలి. ఆ విధంగా నడుచుకోగలిగితే చాలు, ఆఫీసులో కాలక్షేపం అయిపోతుంది. అప్పుడు ఎక్కువపని (కొండొకచో అస్సలు పనే) చెయ్యకపోయినా ఫరవాలేదు. ఎవ్వరూ ఏమీ అనరు. ప్రమోషన్లు సక్రమంగా 'క్యూ' తప్పకుండావస్తాయి. అని సూర్యానిక్కూడా తెలుసు. అనుకుంటే అతడూ చెయ్యగలడు.

కాని అతడు ఇంకెవరో ఎవరో కాదుగద, అతడు సూర్యంకదా' ఇంకో అయిదేళ్లల్లో ఐ. ఏ. ఎస్. లాంటి అడ్డదారివిపడి ఆఫీసరవబోయే వాడు కద. గుమాస్తాలూ, ప్యూన్లూకూడా మనుష్యులేనని వాళ్ళకికూడా

గౌరవమిచ్చి కొంగ్రొత్త సాంప్రదాయాలు నెలకొల్పబోయేవాడు కద— అతడు పైవిధముగ ఎటులచేయును? అంటే చేయడు, అనడంకన్న — అటుల చేయుట అతగాడికి చాలాకష్టము, అని చెప్పుకోవచ్చును....

చేతిలోని కలాన్ని కిందపడేసి గుమాస్తా సూర్యం-మనిషి సూర్యమయిపోదామని బురఖా విప్పేస్తుండగా ఆఫీసరుగారు పిలిచారు. చేదు మాత్రవి గొంతులోకి తోసినట్లయింది సూర్యానికి. అయితేనేం నడిచాడు మహరాజులా. ఆఫీసరు వారిగదిలో నిలిచాడు. రూపాయలు రెండువందలు ఖరీదుచేసే కుర్చీలో సగం పడుకున్నట్లు కూచుని అడిగాడు ఆఫీసరు— "ఏవిటి ఈ చెత్తనోటు?" ఆయన నోట్లోని పైపు నోట్లోనేఉంది. భయభక్తులతో ఒంగి ఆ ఫైలు గమనించాడు సూర్యం.

ఎవరో ఆడకూతురు శ్రీకాకుళంలో గుమాస్తాగాఉంది. కాకినాడలో మొగుడున్నాట్ట, బదిలీ కావాలనిరాసింది. సాధ్యమయినంతవరకు భార్యాభర్తలిద్దరినీ ఒకేచోటపిలిపించమని ఒక రూలు ఏడిచింది. సూర్యం ఆ రూల్‌ని ఉదాహరిస్తూ, ఆ అమ్మాయి మహజరుమేరకు కాకినాడ వెయ్యవచ్చని రాశాడు. హెడ్‌క్లర్క్ సంతకించాడు కూడా.

ఏదో చెప్పబోయాడు సూర్యం. కాని పైపే మాట్లాడింది. "నీఇష్టం వచ్చినట్లు నోట్ రాయడానికి నువ్వేమి డైరెక్టర్‌వి కాదోయ్. అమాట కొస్తే డైరెక్టరువి కాబోవుకూడాను నువ్వొ గుమాస్తావి....అది గుర్తుంచుకో....ఆ అమ్మాయి ఉత్తరం అక్కడఉంచి నోరుమూసుకుంటే ఆ ఆర్డరేదో నేనివ్వగలను—" అని ఫైలు విసిరేశాడు ఆఫీసరు-మనిషి సూర్యం గుండెల్లో పాములపుట్టయై అభిమానం బుసలుకొట్టగా, గుమాస్తా సూర్యం ఒంగి ఆ ఫైలుని తీసుకున్నాడు.

బయటికి వచ్చేస్తుంటే "ఇదిగో చూడూ! ఆ స్టెనోతో చెప్పి రెండు కాఫీలు తెప్పించూ-" అన్నాడు పై ఆఫీసరు.

స్టెనోకు ఆమాట చెప్పివచ్చి తన సీట్లో కూచున్నాడు సూర్యం.

ఆ అమ్మాయి రాసిన ఉత్తరాన్నిగమక అలాగే ఫైల్లోపెట్టి పంపించి ఉంటే–"ఎందుకోయ్ మీరంతా ఉండడం? ఆ కేసుగురించి చిన్ననోటు రాసి పంపలేవూ" అన్నమాట వచ్చి తీరుతుంది. తనుచేసిన తప్పేమీలేదు. కాని తిట్లువచ్చాయి.

తను గుమాస్తానే, తనకు ఆ విషయంతెలుసు. తేలుకుట్టినట్లు అప్పు డప్పుడూ ఆ విషయం నెమరుకొస్తుంది. అప్పుడు తనలోపల వెయ్యి కాగ డాలు మండుతాయి. తను చదవాలనుకున్న ఇంజనీరింగూ, చదివి ప్యాస యిన ఫస్టుక్లాసు ఇంటరూ కలిసి నవ్వుతాయి. నిజంవెలుతురు భరించని అల వాటు మగతలోపడి, నలుగురిలో ఒక్కడుగాపడి, అంతులేనిఅప్పుల్లోపడి, చావలేని బ్రతుకులోపడి, మనస్సుమీద మందంగా ముసుగు కప్పేసుకుని, కడుపుమాత్రంఉన్న ఒకమనిషిగా బ్రతకాలనుకుని– అది మచ్చికవుతున్న క్షణంలో ఛెళ్లున కొరడాతగులుతుంది–మాంచినిద్ర వస్తున్నప్పుడు ఎవరో తట్టి లేపినట్లు. "నువ్వు గుమాస్తావి" అన్నాడు ఆఫీసరు నువ్వు నెలకు తొంభై రూపాయలవి. నువ్వు ఒలికిపోయిన సిరావి. నువ్వు మూసేసిన ఫైలువి.... నువ్వు పనికిరాని పాత రూలువి.... అన్నట్లు. పైపెచ్చు తోటి మనిషిమీద ఎంత వాత్సల్యమో–"నువ్వు నీ జీవితమంతా గుమాస్తావే" అని ఆశీర్వదించాడు సహృదయుడు.

అవతలిమనిషి ఎవరు తెలియని అజ్ఞానమా, నెల తిరిగేసరికి వెయ్యి రూపాయలు వస్తుందన్న అహంకారమా, అర్థంకాలేదు సూర్యానికి.

సముద్రం పొంగి పొంగి మీద కొస్తున్నపుడు ఎంతదూరమని పరు గెడతావు? శక్తిఉంటే, నీకు తెలిసివుంటే–ఈదుతావు. లేకపోతే మునుగు తావు. అధికారంఅంటే పంచమహాసముద్రాలకన్న పెద్దది. ఆ రాశిముందర నువ్వొక పూచికపుల్లవి. నువ్వు లేకపోతే అదిఉంది. కాని అది లేకపోతే నువ్వులేవు.... అలలమధ్య అయిదున్నరకొట్టినట్లు వినిపించింది. కొందరు

వరండాలో — అదే తమ క్లబ్బు — కూర్చుని కేరమ్స్ ఆడుతున్నారు. సూర్యం ఎంగిలి మింగాడు. చేదుగా ఉంది.

సరిగ్గా ఆరింటికి జయమ్మ లైటు వేస్తుంది. కాని పార్వతి అలా చెయ్యలేదు. ఎందుకూ అంటే పార్వతివాళ్ల వాటాలో ఎలక్ట్రిక్ దీపాలు లేవు గనుక. పార్వతి కాస్త నిదానించి ఏ ఆరున్నరకో ఏడింటికో వెలిగిస్తుంది లాంతరు. రోజూ కొక అరగంట ఎక్కువ చొప్పున లాంతరు ఒకనెలరోజుల పాటు వెలిగితే కిరసనాయిలుకో రూపాయిపావలా ఎక్కువ అవుతుంది — అన్న లెక్కలు పార్వతికి బళ్లో చెప్పలేదు. బడివిడిచింతర్వాత ఆమే నేర్చుకుంది ప్రైవేటుగా.

ఆ పూటకూడా నెమ్మదిగా లాంతరుతీసి చిమ్నీని తుడవడం ప్రారంభించింది పార్వతి. ఈ పనయింతర్వాత మొహం కడుక్కుని బొట్టు పెట్టుకోవాలనుకుంది పార్వతి. చేతిలోని చిమ్నీ ఉత్తి పుణ్యానికే టప్పుమంది. ఒకపక్క విరిసింది. కొనబోతే దానిఖరీదు ఏ అర్థరూపాయో వుంటుంది. ఎంతో వోపికగా లేచింది పార్వతి. చాదుగిన్నెలో ఒకచుక్క నీళ్లుపోసి తెచ్చింది పాతకాగితంముక్క నొకదానిని వేలుపొడుగున చింపి, దానికోపక్క చాదును పూసింది. విరిసినచోట చిమ్నీమీద ఆ కాగితాన్ని అతికించింది. సగం తుడిచిన చిమ్నీని ముట్టుకుంటే ఎక్కడ రెండయిపోతుందోనని అలాగే బిగించి దీపం వెలిగించింది.

అగ్గిపెట్టెలో ఇంకా ఆరే పుల్లలున్నాయి. అంటే మూడురోజులు రావచ్చు అనుకుంది పార్వతి. సూర్యం నెలకు రెండు అగ్గిపెట్టెలని తెస్తాడు. నెలంతా ఆ రెంటితోనే గడవాలి. ఒక్కరోజు ముందుగా అగ్గిపెట్టె అయిపోయిందంటే అతడికి కోపం వస్తుంది. ఆ కోపంలో మండే దీపాలు అవీ వెల్గించుకోవచ్చు. అది చవకకూడాను. అగ్గిపెట్టెల విషయంలో అంత ఖరారుగా వున్నందువల్ల ఆయనను లోభి అనకూడదు అంటుంది పార్వతి అంతరంగం. దరిద్రం అని నోరువిడిచి చెప్పడానికేమో ఇదిగా వుంటుం

దాయె.... అందుకనే కుంపటిఅంటించితే, ఆ నిప్పులో ఓ కాగితం అంటించి దీపం వెల్గిస్తుందిపార్వతి. దీపమే ముందర వెలిగించివుంటే దానినుండి కుంపటి రాజవేస్తుంది పార్వతి. అప్పటికే అగ్గిపెట్టె అయిపోతే జయమ్మ దగ్గర ఓ నాలుగు అగ్గిపుల్లలు తీసుకొస్తుంది అంతేకాని అగ్గిపెట్టె అయిపోయిందనిమాత్రం సూర్యానికి చెప్పదు. ఆ మాటకొస్తే సూర్యం తలచుకుంటే ఇంకో అగ్గిపెట్టె కొనలేడనా, కాదు, కానీ.... అగ్గిపెట్టెలదగ్గర కూడా ఆలోచించవలసినంత ఐశ్వర్యంలో వున్నాంకదా అన్నతలపు అంత ప్రశాంతమయినదేమీకాదుగా.... అందుకని సూర్యం ఆ విషయం ఆలోచించడు పార్వతి ఆ ఊసెత్తదు. వాళ్లిద్దరిదీ అంత ఆదర్శమయిన దాంపత్యం!

పాలవాడొస్తే పాలుపోయించుకుంది పార్వతి. జయమ్మకూడా పాలుతీసుకుంది. జయమ్మ ఎగ్జిబిషన్‌కు వెళ్ళింది. కుంపటిమీద పాలుంచి మొహం కడుక్కుంది పార్వతి. బొట్టు పెట్టుకుంది. తెల్లచీర కట్టుకుంది. పాలగిన్నెదించి, జయమ్మకని తీసుకున్నపాలని కుంపటిమీద పెట్టింది. పొద్దుటి చారున్నాయి అవి వేడిచేసి, ఇన్నిబియ్యం వుడికించి, రెండుఅప్పడాలు నిప్పులమీద కాలిస్తేచాలు, ఆనెల్లో ఇరవైమూడవరోజు అయిపోతుంది.

ఏడయిపోయింది.... ఇంకా రాదేం వెధవబస్సు అనుకున్నాడు సూర్యం. అప్పటికతడు అరఘంటాయి నిల్చొన్నాడు బస్‌స్టాపులో. ఒక బస్సు రానేవచ్చింది కాని, స్టాపులో ఆగలేదు. అవును, మహానగరంలోని బస్సులన్నీఅంతే. ఆగవలసినచోటుకో అరఫర్లాంగుకవతల, ఎవరూ పరుగెత్తుకొచ్చి ఎక్కలేనిచోట ఆగుతాయి. అలాగ ఆపమని కండక్టర్లకూ డ్రైవర్లకూ రహస్యమయిన ఆదేశాలున్నాయిట!.... అదేదో అధికారికి రాసి కనుక్కుంటాను అనుకున్నాడు సూర్యం. వెంటనే అయిదుపైసలకార్డు ఆరుపయిసలయిన కథ గుర్తుకొచ్చింది. వెన్వెంటనే కాళ్లకింద భూమి

లాగేసినట్లయింది, ఖచ్చితంగా అప్పిస్తానన్నవాడు ఇంకోవూరు వెళ్లినట్లు అయింది.

చెరపీడినవాడిలా చరచర అడుగులువేసుకుంటూ నడిచాడుసూర్యం పెద్దబజారుకు. ఏదో మంచివేళ కాబట్టి తన ఆర్థిక పరిస్థితి చటుక్కున గుర్తుకొచ్చింది. లేకపోతే, జేబులోవున్న మూడుపైసలతో బస్సెక్కేవాడు....అవ్వ! అందరూ తనవేపే చూస్తున్నట్లనిపిస్తే ఇంకాస్త వేగంగా నడిచాడుసూర్యం. టపటపనడిస్తే పాతిక నిముషాల్లో పెద్దబజారువచ్చింది—రాక ఏంచేస్తుందనుకోండి! పెద్దదయినా చిన్నదయినా బజారుఅంటే సూర్యానికి కొంచెం దడపుడుతుంది. తప్పుచేసిన కుర్రవాడు హెడ్‌మాష్టారు గదిలో నిల్చున్నట్లువుంటుంది. అందులోనూ పార్వతిపక్కనవుంటే శాపగ్రస్తులూ దైవోపహతుడూ వగైరా సమాసాలన్నీ అతడే అవుతాడు. మరయితే అల్లాంటివాడు నోరుమూసుకుని ఇల్లుచేరక మూడుపైసలతో పెద్దబజారుకు రానేల ?

అందరూ బజారులో ఏదోఒకటి కొనడానికి వస్తారు. సూర్యం అందుకు వ్యతిరేకంగా ఒకటి అమ్మడానికి బజారుకువచ్చాడు. ఇదేమిటి సూర్యానికి ఏవన్నా రోజూ ఇలా అమ్మడం అలవాటా? అబ్బే కాదు. ఆ మాటకొస్తే అతడు అలాచేద్దామనుకోవడం ఇది మొదటిసారి...అంతకు ముందురోజు రాత్రి రెండింటికి మెలకువవచ్చినప్పుడు, అప్పటినుండి అయిదింటిదాకా నిద్రరానప్పుడు, సూర్యం బుర్రలోవుడికిన అనేకములయిన—ఆలోచనల్లో అతి దారుణమయినది—ఒక పుస్తకాన్ని పాతపుస్తకాలషాపువాడికి అమ్మితే ఒకటో రెండో రూపాయలు వస్తాయన్నది.

పుస్తకం అంటే సూర్యానికి బ్రాందీలాంటిది. నల్లమందులాటిది. అమ్మఒడిలాటిది. పక్షికి రెక్కల్లాంటిది. తను చచ్చిపోయేలోగా వెయ్యిపుస్తకాల లైబ్రరీ సేకరించాలని సూర్యంయొక్క జీవితాశయం. రేపో ఎప్పుడో హఠాత్తుగా తనుకారూ అవీ కొన్నప్పుడు మదరాసుకెళ్లి పెద్ద

పెద్ద పుస్తకాలషాపుల్లోకి దర్జాగావెళ్ళి, కారు నిండిపోయేటట్లు, షాపుల వాళ్లు భ్రమించిపోయేటట్లు కొన్నివందలపుస్తకాల నొక్కసారే కొనేసుకు రావాలన్నది—సూర్యం చాలకాలంనుండి పెంచుకుంటున్న ముచ్చటయిన కలల్లో ఒక్కటి. కాని ఇప్పటికి, సంపాదన ఆరంభించిన ఆరేళ్లలోనూ కొన్న పాతిక పుస్తకాలలోనూ, సంస్కృతశ్లోకం మేరకు పరహస్తగత మయినవి పోగా అతడిదగ్గర మిగిలినవి ఏ పద్నాలుగో వుంటాయి. అందులో ఒకదానిని, అసలుధర అయిదురూపాయలయిన మూడువందల పేజీలదానిని తీసుకుని, పాతపుస్తకాలవాడికమ్మితే రెండురూపాయలయినా వస్తాయని పెద్దబజారుకొచ్చాడు; నెలలో ఇంకా ఏడురోజులు గడవాల్సిన సూర్యం.

వాడెవడో టెరిలీన్‌చొక్కావాడు, అపిలు కొనుక్కుని కొరుక్కుని తింటున్నాడు. అలా వీధిలోనిల్చుని తినేవాళ్ళంటే—మధ్యాహ్నం టిఫిను మానేసిన సూర్యానికి చాలాకోపం. అతడికోపం అపిలుమీదనా, దానిని తినేవాడిమీదనా అని అడగడం బాగుండదు. ఈలోపుగా సూర్యం పాత పుస్తకాలషాపులు వరసగా వున్నప్రాంతం చేరాడు.

తన కూతురుని తగనివాడికి బానిసగా అమ్మేస్తున్నట్లు అనిపించింది. రోడ్డుమీద తన్నుపడేసి, తనమీదే జనమూ,బళ్ళూ,ఆవులూ,మేకలూ, నడిచిపోయినట్లనిపించింది. మరి వేరే దారిలేదు. ఎరిగిన వాళ్ళందరిలోనూ తను అప్పడిగి పుచ్చుకోనివాడులేడు. నాలుగయిదుసార్లు ఆ దుకాణాల వెంబడి అటూ ఇటూ తిరిగాడు. ఎట్టకేలకు మొండిధైర్యం తెచ్చుకున్నాడు. చెమటలు పోస్తుండగా ఒక దుకాణంముందు ఆగాడు. ఒకటి రెండు పుస్త కాలు చూసినట్లు నటించాడు. హఠాత్తుగా తలెత్తి ఆ దుకాణంవాడికి— "మీరు మా దగ్గర్నుంచి పాతపుస్తకాలు కొంటారేమిటి?" అని నిర్లక్ష్యంగా వాడిజవాబుతో తనకు పనిలేదన్నట్లు అడిగాడు.

కొంటామన్నాడు వాడు.

తటాలున జేబులోని పుస్తకంతీసి వాడిచేతిలోకిచ్చాడు సూర్యం.

ఆ పుస్తకాన్ని తనకే అమ్మడంలో ఈ సూర్యం అనబడే పురుషుడు చేస్తున్నత్యాగం ఏమీ అర్థంకానట్లు ఆ పుస్తకాన్ని ఇటూ అటూ చూశాడు దుకాణంవాడు.

ఏ రూపాయో ఇస్తానంటాడు కాబోలువెధవ, సగంధర రెండున్నర కనుక రెండురూపాయలయినా ఇమ్మని ఖచ్చితంగా అడగాలి అని తర్కించుకున్నాడు సూర్యం—హఠాత్తుగా దుకాణంవాడు తనచేతికిపుస్తకం ఇచ్చెయ్యడంతో ఏమీ అర్థంకాలేదు సూర్యానికి....

“ఇది అమ్ముడు పోదండీ, నాకొద్దు. ఏ దయినా డిటెక్టివు నవల్సుగాని, సోషల్‌స్టడీస్, లెక్కలూ, వాచకాలుగాని, గైడ్లుకాని తెండి....”

సిగ్గుతో, అక్కసుతో, కోపంతో, అవమానంతో—చేతిలో అయిదు రూపాయల పుస్తకంతో వెళ్ళిపోతున్న సూర్యానికి దుకాణంవాడి సలహాలు వినపడలేదు.

ఎంగిళ్ళుతీసి కంచాలూ, వంటగది కడిగి, అంట్లు తోమేసరికి పదయింది పార్వతికి. పక్కవాటాలో తాళంతీసిన చప్పుడయింది. జయమ్మ వచ్చిందికాబోలు. అవిడకని తోడయించుకున్నపాలు తీసుకెళ్ళి ఇచ్చింది పార్వతి.

ఎగ్జిబిషన్‌లో వెండిఫిల్‌గ్రీహారమూ, లక్నో చికాన్‌చీరా—పార్వతికి నచ్చిన సిమెంటురంగుమీద అతి నాజూకయిన ఎంబ్రాయిడరీవున్నదీ — దంతంతో చేసిన వేణుమాధవుడి విగ్రహమూ—అంగుళం ఎత్తుది, పదహారు రూపాయిలట—అవన్నీ కొనుక్కొచ్చింది జయమ్మ.

చూపించింది పార్వతికి....

భోజనం ముగించి పరుపుమీద పడుకునివున్నాడు సూర్యం. కళ్ళు మూసుకునివున్నాయి. కాళ్ళు పీకుతున్నాయి.

ఇవాళ తారీఖు ఇరవైమూడు—అనుకున్నాడు సూర్యం.

ఆ గదిలో లాంతరులేదు. వీధిదీపం వెలుతురు కిటికీకి ఎదురుగా వున్న గోడమీద పడుతూంది. 'నువ్వెప్పుడూ గుమస్తావే' అన్నాడు ఆఫీసరు.... 'ఏం వోయ్; టిఫినుకురావేం?' అంటాడు సీ త్రి. ఎక్కాల్సిన చోట ఆగదు వెధవబస్సు. ఆగినా ఎక్కలేడు తాను. 'ఈ పుస్తకం అమ్ముడుపోదుసార్' అంటాడు అంగడివాడు.

పొర్లిపడుకున్నాడు సూర్యం. కళ్ళల్లో ఒకటి రెండుచుక్కల నీళ్లింకే తలగడా లాగేసింది. ఆతడికే ఆశ్చర్యంవేసింది తనలో ఇంకా తడివుందా అని....

పాదాలమీద చల్లటిచేతులు తగిలేసరికి వులిక్కిపడ్డాడు. పార్వతి పనంతా ముగించుకొని వచ్చింది కాబోలు. కాళ్ళు పడుతూంది....

చీకట్లోనయినా పార్వతికళ్ళు ఎంతందంగావున్నాయో అవి మొదట సారిగా చూసినంత ఆనందంతో నిండిపోయాడు సూర్యం.

వెధవది....ఆ పుస్తకాన్ని షాపువాడు వద్దనడమే మంచిదయింది. రెండురూపాయలకేమిటి ఎక్కడయినా అప్పుతేవచ్చు; కాని అంత మంచి పుస్తకం సులభంగా దొరకదే! "నేనెప్పుడూ గుమాస్తాగానే వుండనోయ్ చిన్నయ్యా....చూస్తూవుండుమరి–" అని చెబితే బాగుండును....

లేచి కూచున్నాడు సూర్యం. పార్వతిని దగ్గరకు తీసుకున్నాడు. నగలూ చీరలూ అక్కర్లేదుగాని ఈ అదృష్టాన్నిమాత్రంవుంచు భగవంతుడా అనుకుందిపార్వతి.

చీకట్లోనయినా పార్వతికళ్ళు ఎంతందంగా వున్నాయో అని మళ్లీ అనుకున్నాడుసూర్యం....ఆ! ఆ మాటకొస్తే వెధవది, ఎప్పుడూ వుంటుందేవిటి? రేపొద్దుటికి ఈ చీకటి పోదా, వెలుతురు రాదా – అనుకున్నాడు సూర్యం.

('భారతి' ఏప్రిల్–63)